
# కల



-నాదెళ్ళ రఘు

సాయంకాలం నాలుగైంది.

గుడ్లవల్లేరు బస్టాండ్ ప్రయాణీకులతో కళకళ లాడుతోంది. ఎవరి ఆత్రుత వారిది. ఎవరి ఎదురు చూపులు వారివి. ఎదురుచూస్తున్న బస్సు రావ డంతో ఎవరికి వారు ఎగబడి బస్సులు ఎక్కడానికి చిన్నపాటి ముష్టి యుద్ధాలు కూడా చేసుకుంటు న్నారు. అదంతా చూడడానికి అర్థంగాని అదో మాయాలోకంగా ఉంది.

నా జీవితం కూడా ప్రస్తుతం అర్థంగాని ఆధారం లేని గాలిపటంలా ఉంది. జీవితంలో పడాల్సిన కష్టా లన్నీ పడ్డాను. ఇంకా పడుతూనే ఉన్నాను. అయినా ఇంకా ఏదో ఆశ! ఏదో తెలియని తపన! నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. ఆ ఆశతోనే తెలిసిన స్నేహితుడున్నాడు తోచినంత సాయం చేస్తాడు అని కడివెడు ఆశతో కాళ్ళీడ్చుకుంటూ వెళ్లాను. కానీ వాడు ఊళ్లో లేడు.

బస్సు ఛార్జీల కని వారం రోజులు చేసిన ప్రయత్నం ఫలించి సాధించిన విజయంతో పొద్దు ననగా వచ్చాను. కానీ ఆశించిన ఫలితం శూన్యంలా కళ్లముందు గిరికీలు కొడుతోంది. ప్రొద్దున్నుంచీ కడుపు బాధకు సరైన సమాధానం లేకపోయినా జేబులో ప్రస్తుతం రెండురూపాయలే ఉన్నాయి. తిరుగు ప్రయాణానికి ఇంకా రూపాయి న్నర తగ్గింది. అక్కడున్న బెంచీ బల్ల మీద కూలబ డ్డాను. మా ఊరికి వెళ్ళే చివరిబస్సు రావడానికి అర్థగంట టైం ఉందని పక్కనున్న వాళ్ళు అనుకుం టుంటే లీలగా వినిపించింది.

* * *

అందరూ ఎదురుచూస్తున్న బస్సు కాస్తా రయ్యిన వచ్చి ఎక్కండన్నట్లు అక్కడే ఆగింది. నా అదృష్టం కొద్దీ అంతరద్దీలోనూ కండక్టర్ ప్రక్క సీట్ ఖాళీగా దొరికింది. దర్జాను అరువు తీసుకుని మరీ ఠీవిగా బస్సు ఎక్కి నా సీట్లో జారబడ్డాను. "రైట్ రైట్" అంటూ కండక్టర్ బస్సెక్కడంతో భారంగా కదిలింది బస్సు. ప్రయాణికులందరూ టిక్కెట్లు తీసుకోవడం కోసం తయారవుతున్నారు. కండక్టర్ వెనుకసీట్ల నుండి టిక్కెట్లు ఇవ్వడం మొదలెట్టాడు. అంతా గమనిస్తూనే ఉన్నాను. అంతలోనే కండక్టర్ నాకు దగ్గరవ్వబోయాడు. నా పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. అర్థరూపాయి తగ్గితే ఒప్పుకోని కండక్టర్ రూపాయిన్నర తగ్గితే ఎలా ఊరుకుం టాడు? అనుకుంటూ ఆలోచిస్తున్న నాకు మెరుపు లాంటి ఆలోచన మెదిలింది. అంతలోనే నా దగ్గరకొ చ్చిన కండక్టర్ ఎక్కడికీ? అన్నట్టు నా వైపు చూశాడు. రెండురూపాయల కాసు చేతిలో పెడుతూ "గుడివాడకి ఒక టిక్కెట్" అన్నాను.

'ఇదేంటి?' అన్నట్లు బేలగా నావైపు గుడ్లురిమి చూశాడు బట్టతల కండక్టర్. నేనూ అదే స్టయిల్లో "నాదగ్గర అంతే ఉంది ఎలాగో అడ్జస్ట్ చేసుకో" అన్నాను.

"ఏంటీ అడ్జస్ట్ చేసుకోవాలా? బస్సు మన బాబుగాడిదేం కాదు. ప్రతి పైసా అక్కడ లెక్కచె ప్పాలి. రూపాయిన్నర తీస్తావా బస్సు ఆపు చేయిం చమంటావా?" అన్నాడు మరింతగా గుడ్లుమిటక రిస్తూ. నేను అతనితో తొందరపడకుండా చాలా నిదానంగా-

"చూడండి కండక్టర్‌గారూ ఆవేశం అనర్థానికి మూలం" అన్నాను.

"నీ నీతిసామెతలు ఆపి ముందు రూపాయి న్నర తీస్తావా బస్సు ఆపమంటావా?" అన్నాడు యధాలాపంగా. ఇక ఆలస్యం చేస్తే బాగోదని అసలు విషయానికి వచ్చేశాను.

"అయ్యా కండక్టర్ గారూ నాకు ఏమీ తెలియద నుకోకండి. ఇదే బస్సులో గుడివాడ వెళ్ళే వాళ్ళు పదిమందికి పది టిక్కెట్లు ఇచ్చావ్. ప్రతి ఒక్క టిక్కె ట్టుకు ఐదురూపాయిలు చొప్పున ఇస్తే వాళ్ళకు తిరిగి రూపాయే ఇచ్చావ్. మిగతా అర్థరూపాయి ఏమైనట్టు. ఒకటి కాదు రెండు కాదు మొత్తం పది అర్థరూపాయిలు. ఇదంతా నేను గమనించలేదను కుంటున్నావా? వాళ్లంతా నాకు తెల్సు వారికి అసలు విషయం చెప్పేయనా?" అన్నాను చాలా సీరియస్‌గా. కండక్టర్ మొహంలో రంగులు మారి పోయాయి. ఎక్కడలేని ఆందోళన అతన్ని ఆవరిం చింది. చటుక్కున నా పక్కన ఒదిగి కూర్చుని నా రెండురూపాయిలూ నా చేతిలో పెట్టి గుడివాడకు టిక్కెట్ నా చేతిలో పెడుతూ "సారీ సర్ మీరు ఏమి అనుకోకండి. క్షమించండి. వాళ్లకు అసలు విషయం చెప్పి నా పొట్ట కొట్టకండి సార్" అని బ్రతి మిలాడడం మొదలెట్టాడు.

ఆనందంతో నా ఛాతీ అంగుళం పొంగింది. అయినా అదే ఠీవితో "చూడండి కండక్టర్‌గారూ ప్యాసింజర్ల మంచితనాన్ని, ఓపికనీ ఆసరా చేసు కుని అమాయక ప్యాసింజర్ల దగ్గర నుండి బోలెడు డబ్బులు దండుకుంటున్నారు. ఈ విషయం గురించి మా ప్రయాణీకుల్లో చైతన్యం తీసుకురావ డానికి అవగాహనా సదస్సులు ఏర్పాటుచేయాలి. ఈ విషయం గురించి అసెంబ్లీలో చర్చ పెట్టిం చాలి" అన్నాను రాజకీయ నాయకుడి లెవెల్లో.

అలా అనేసరికి కండక్టర్ కొన్ని క్షణాలు అయో మయంలో పడ్డాడు.

"సార్ అలా చేయకండి. మీరా ఆలోచన ఆచర ణలో పెట్టకుండా ఉంటే అందుకు ప్రతిఫలంగా మీకు కృతజ్ఞతగా మా అందరి తరపునుంచి మీకు మంచి బహుమతి అందజేసుకుంటాం. మీకు పుణ్యం ఉంటుంది" అంటూ మరింతగా ప్రాధేయ పడడం మొదలెట్టాడు. కష్టం అంటే ఏంటో స్వానుభ వంగా తెలిసినవాడిని కాబట్టి కష్టం ఎవరికైనా ఒకటే కదా పాపం అనుకుని "సరే అసలు విషయం ఏంటి?" అన్నట్లు చూశాను.

* * *

అంతకడుపుమంటలోనూ కళ్ళెప్పుడో అంటు కున్నాయి. అంటే నేను బస్సెక్కడం, కండక్టర్ బ్రతి మిలాడడం అన్నీ అన్నీ...అర్థం చేసుకుని గబు క్కున బెంచీ బల్ల మీదనుంచి లేచి పిచ్చాడిలా చుట్టూ చూశాను. బస్టాండ్ అంతా వర్షం వెలిసిన ఊరులా ఉంది. ప్రయాణీకులెవ్వరూ కనిపించ ట్లేదు. అయినా ఆశ చంపుకోలేక పక్కనే ఉన్న కిళ్లీ కొట్టు దగ్గరకెళ్లి "గుడివాడ బస్సు ఎప్పుడొ స్తుంది?" అన్నాను.

"ఇప్పుడేం బస్సయ్యా ఎక్కడున్నావ్ ఇంత సేపూ. ఎప్పుడో వెళ్లిపోయింది. ఇక రేపు పొద్దుట ఆరుగంటలకే" అన్నాడు దాదాపు కసురుకుంటు న్నట్లుగా అన్నాడు కిళ్లీ కొట్టువాడు.

కళ్ళు బైర్లు కమ్ముకొస్తుంటే రాత్రంతా ఖాళీ కడుపుతో చేయాల్సిన బస్టాండ్ జాగారం గుర్తుకొ చ్చింది. ★